భూముల అవకతవకలపై విచారణ చేయాలి

రాజాపూర్, జనవరి 4 : మండలంలోని చొక్కంపేట, దొండ్లపల్లి, తిర్మలాపూర్‌లో దళితులు, గిరిజనుల భూములు పేదలకు చెందాలని ఎమ్మెలే అనిరుధ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణయ్య, చొక్కంపేట మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య గురువారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరూ వ్యక్తులు దళిత, గిరిజనుల ఇనాం భూములను అక్రమంగా పేర్లు బదిలీచేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు రైన్‌బో, స్వర్గసీమ, ఆర్‌ఎస్ బ్రదర్స్ సంస్థలకు విక్రయించినట్లు తెలిపారు. ఈ భూముల కేసులు జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉన్నాయని, పేదల భూములు పేదలకు చెందేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్‌టౌన్, జపవరి 4: జిల్లా కేంద్రంలో ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న ఫస్ట్ 5 సీనియర్ జాతీయ స్థాయి నెట్‌బాల్ సీనియర్ చాంపియన్‌షిప్ పోస్టర్లను గురువారం స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. స్టేడియం మైదానంలో పలురాష్ట్రాల జట్లు టోర్నీలో పాల్గొననున్నాయి. కార్యక్రమంలో నెట్‌బాల్ ప్రతినిధులు విక్రమ్‌ఆదిత్యరెడ్డి, అంజద్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నివారించాలి

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట టౌన్, జనవరి 4 : జిల్లాలో బాల్యవివాహాలను నివారించాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బాల రక్షాభవన్‌లో మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాలను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. చైల్డ్, ఎల్డర్ హెల్ప్ లైన్‌ల గురించి ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను సీడీపీవోలు, సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. మరికల్, ధన్వాడ, మండల కేంద్రాల్లో ప్రీస్కూల్‌ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి మహిళా, శిశు సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అంతకుముందు సివిల్ లైన్‌లో ఉన్న అంగన్‌వాడీ ప్రీ మోడల్ స్కూల్‌ను, సఖీ కేంద్రం, అనాథ, వయో వృద్ధుల ఆశ్రమాన్ని ఆమె సందర్శించారు. అదేవిధంగా పట్టణంలోని 4వ వార్డులో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పర్యటించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. పట్టణంలోని సీపీఆర్ బంగ్లాలో తపస్ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో వేణుగోపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, కమిషనర్ సునీత, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, తపస్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తులను డేటా ఎంట్రీ చేయండి

- ఎంపీడీవోలతో కలెక్టర్ వీసీ

మహబూబ్‌నగర్, జనవరి 4 : ప్రజా పాలనలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును డేటా ఎంట్రీకిగానూ, గుర్తించిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు తక్షణమే శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ వీసీ ద్వారా ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించిందని, ఈ మేరకు అధికారులు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో 213 సిస్టమ్స్‌తోపాటు 400 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించామని, జిల్లాలో ఉన్న అందరూ డేటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మూడు విడతలుగా డేటా ఎంట్రీ చేయాలన్నారు. 5వ తేదీ వరకు గ్రామ సభలు పూర్తయ్యే మండలాల్లో రేపే డేటా ఎంట్రీ ప్రారంభించాలని తెలిపారు. మున్సిపాలిటీల్లో 6న సాయంత్రం నుంచి డేటా ఎంట్రీ ప్రారంభంకావాలని తెలిపారు. డేటా ఎంట్రీ పూర్తిస్థాయిలో టీం లీడర్లతే బాధ్యతన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, ప్రత్యేక అధికారులు ఉన్నారు.

నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, జనవరి 4 : ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులను ఎలాంటి తప్పులు లేకుండా ఈనెల 5వ తేదీ(నేటి) నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ జి.రవినాయక్ అధికారులకు సూచించారు. మండలంలోని గురుకుంటలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ డేటా ఎంట్రీపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మండల స్థాయిలో అందుబాటులో ఉండే కంప్యూటర్లు, ఆపరేటర్ల వివరాలను తమకు అందజేయాలని కోరారు. ఈనెల 17వ తేదీ నాటికి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుధాకర్, ఎంపీడీవో శ్రీలత, సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ అనిత, నాయకులు పాల్గొన్నారు.

డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలి

ఊట్కూర్, జనవరి 4 : ఓటరు జాబితాలో ఒకే వ్యక్తికి సంబంధించిన డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలని తాసీల్దార్ శివ శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక రైతు వేదిక భవనంలో బీఎల్‌వోలకు డబుల్ ఎంట్రీ ఓట్ల తొలగింపుపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు ఐఎన్‌టీఎస్‌వో పరీక్షలు

జడ్చర్లటౌన్, జనవరి 4 : విద్యార్థులకు పోటీ పరీక్షల్లో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీచైతన్య పాఠశాలలో ఐఎన్‌టీఎస్‌వో పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు 120 మంది విద్యార్థులు హాజరుకాగా, ఎంటీఎస్‌వో విభాగంలో 46 మంది, ఈటీఎస్‌వోలో 21, ఎస్‌టీఎస్‌వోలో 31, జీటీఎస్‌వోలో 12, ఏటీఎస్‌లో 10 మంది ప్రతిభ కనబరిచారని, వారిని సత్కరించామని ప్రిన్సిపాల్ సజీలాపర్వీన్ తెలిపారు.

విద్యావలంటీర్‌కు గౌరవ వేతనం అందజేత

నర్వ, జనవరి 4 : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వహించే విద్యావలంటీర్‌కు సంబంధించిన 3నెలల గౌరవ వేతనాన్ని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు దండు అయ్యన్న గురువారం పాఠశాల హెచ్‌ఎం రాజేశ్‌కు రూ.18వేలు విరాళం అందజేశారు. మూడు నెలలుగా ఇవ్వాల్సిన గౌరవ వేతనాన్ని విద్యావలంటీర్ మహేశ్వరికి అందజేశారు. హెచ్‌ఎం రాజేశ్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రఫీ ఉన్నారు.

కోర్టు కానిస్టేబుల్‌ను అభినందించిన జిల్లా జడ్జి

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జనవరి 4: జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను రాజీ చేయించినందుకు వన్‌టౌన్ కానిస్టేబుల్ నర్సింహులును మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి పాపిరెడ్డి అభినందించారు. గురువారం జిల్లా కోర్టులో డిసెంబర్ 30న నిర్వహించిన లోక్ అదాలత్‌లో జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్‌లలో కంటే ఎక్కువ సంఖ్యలో రాజీచేసినందుకు ఆయన సేవలను జడ్జి గుర్తించినట్లు సీఐ సైదులు తెలిపారు. జిల్లాలో ప్రథమ స్థానంలో వన్‌టౌన్ పోలీసు స్టేషన్ నిలిచిందన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EMI PLOTS
★EMI Plots in Jadcherla MUDA Approved Layout. గజం: 8,000/- రూ.లకే, 100 పడకల ప్రభుత్వ హాస్పిటల్‌కి అతి చేరువలో, నెలసరి వాయిదా పద్ధతిలో 10,000/- రూ.లకే ప్లాట్లు పొందవచ్చు. స్పాట్ రిజి।. 7780483434.
NT-314492

PLOT FOR SALE
★మహబూబ్‌నగర్ to నాగర్‌కర్నూల్ హైవే ఫేసింగ్ 300 ఎకరాల డిటిసిపి అప్రూవల్ లేఔట్‌లో 99 నెలల EMI ఫెసిలిటీ కలదు. Marketing Executives కావలెను. Cont: 9133399095
NT-320376

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319403-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

పేదలందరికీ సంక్షేమ పథకాలు

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర : ప్రజాపాలనలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

మద్దూర్ : దరఖాస్తులను స్వీకరిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్

దేవరకద్ర రూరల్(చిన్నచింతకుంట), జనవరి 4 : అర్హులైన ప్రతి పేదోడికి సంక్షేమ ఫలాలు అందజేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిన్నచింతకుంట మండలం కురుమూర్తిలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణయ్య, అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

నర్వ, జనవరి 4 : అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ ఈనెల 6వ తేదీ వరకు ఉంటుందని ఆయా గ్రామాల్లో ప్రకటించిన తేదీలోనే ఇవ్వాలనే నిబంధన లేదని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రజలకు సూచించారు. గురువారం మండలంలోని రాయికోడ్, నాగిరెడ్డిపల్లి, కల్వాల గ్రామాల్లో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయరాములు శెట్టి, సర్పంచులు సుశీలమ్మ, ఇందిరమ్మ, మహేశ్వరమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి సుధాకర్‌రెడ్డి, తాసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో సుదర్శన్, పీఆర్ఏ ఈ మారుతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండలంలో..

మద్దూర్ (కొత్తపల్లి) జనవరి 4 : ప్రజాపాలన దరఖాస్తు ఫారంలను ఎక్కడ కొనవద్దని గ్రామ పంచాయ

నర్వ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

తీల్లో ఉచితంగా పొందాలని నారాయణపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వనజమ్మ అన్నారు. గురువారం కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లి, మాన్నాపూర్ గ్రామాల్లో ఆమె ప్రజాపాలన ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో వలస వెళ్లిన ప్రజల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి నుంచి ఆరు గ్యారెంటీల దరఖాస్తులను స్వీకరించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో జ్యోతి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్ నర్సింహా, సర్పంచులు, అధికారులు ఉన్నారు.

నారాయణపేట మండలంలో..

నారాయణపేటరూరల్, జనవరి 4 : పేట మండలంలోని జిలాల్‌పూర్, బోయిన్‌పల్లి గ్రామాల్లో గురువారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగింది. ఆయా గ్రామాల్లో ఎంపీడీవో వెంకటయ్య, తాసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకద్ర, జనవరి 4 : అర్హులైన వారు ప్రభుత్వం సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రవీందర్‌నాథ్ అన్నారు. గురువారం దేవరకద్ర, గోపన్‌పల్లిలో గ్రామసభ నిర్వహించారు. మండలంలో గురువారం మొత్తం 3,720 దరఖాస్తులను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

మహబూబ్‌నగర్‌లో..

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 4 : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గురువారం 20, 28, 38, 39, 48, 17, 26, 27 వార్డుల్లో దరఖాస్తులు స్వీకరించారు. ఆయా వార్డు సెంటర్లను ఆర్డీవో అనిల్‌కుమార్ ఆధ్వర్యం

లో మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు. ఆయా వార్డు కౌన్సిలర్లు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులను జాగ్రత్తగా తరలించాలి

కోయిలకొండ, జనవరి 4 : ప్రజాపాలన దరఖాస్తులను జాగ్రత్తగా తరలించాలని ప్రత్యేకాధికారి డాక్టర్ మధుసూదన్‌గౌడ్ సూచించారు. గురువారం మండలంలోని అనంతాపూర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల నమోదును పరిశీలించారు. దరఖాస్తుల స్వీకారంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామ పంచాయతీల వద్ద ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో జయరాం, సర్పంచ్ మహేశ్ పాల్గొన్నారు.

జడ్చర్ల మండలంలో ..

జడ్చర్ల, జనవరి 4: జడ్చర్ల మండలంలోని గ్రామాలలో అభయహస్తం ప్రజాపాలన గ్రామభలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా అధికారులు ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నారు. గురువారం జడ్చర్ల మండలంలోని పోచమ్మగడ్డతండా, కొత్తతండా, ఈర్లపల్లి, మర్రిచెట్టుతండా, గోపాల్‌పూర్, లింగంపేట దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో మొత్తం దాదాపు 11 ,783 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు.

ప్రజాపాలన పరిశీలన

జడ్చర్లటౌన్, జనవరి 4 : మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో గురువారం ప్రజాపాలన కార్యక్రమాన్ని జెడ్పీ సీఈవో జ్యోతి పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో 23, 24, 25, 26వ వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఈవో జ్యోతి, మున్సిపల్ కమిషనర్ మహమూద్‌షేక్ పలుకేంద్రాలను పరిశీలించి, దరఖాస్తులను స్వీకరించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

బాలానగర్, జనవరి 4 : ప్రజాపాలన కార్యక్రమంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రవినాయక్ హెచ్చరించారు. మండలంలోని జీడిగుట్టతండాలో గురువారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు సమర్పించేందుకు ప్రజలు క్యూలైన్‌లో నిలబడి దరఖాస్తులు స్వీకరించేందుకు ఎవరూ లేకపోవడంతో పాటు, గ్రామసభలో ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు సరిగా చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాబురావు, ఎంపీడీవో కృష్ణారావు, తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి

- నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష

మరికల్/మక్తల్ అర్బన్, జనవరి 4 : ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని నారాయణ పేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తాసీల్దార్‌కు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదులో డబుల్ ఓటర్లుగా ఉన్నవాటిని తొలగించాలని, ఓటరు లిస్టులో పేరు ఉండి మృతిచెందిన వారిని గుర్తించి వారి పేర్లను తొలగించాలని సూచించారు. నూతన ఓటర్లుగా చేర్చేకునేందుకు యువతను ప్రోత్సహించాలని చెప్పారు. అనంతరం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులు వేగవంతం చేయాలన్నారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మక్తల్ మున్సిపాలిటీలోని 1వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. రేషన్‌కార్డు కోసం తెల్లకాగితంపై వివరాలు రాసి ఇవ్వాలని తెలిపారు.కార్యక్రమం లో తాసీల్దార్ సునీత, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏఈ వెంకటేశ్, డీటీ శ్రీశైలం, సుధాకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ గోపాల్‌రావు, హెచ్‌ఎం మనోరంజనీ, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, కమిషనర్ బలరాంనాయక్, మల్లికార్జున్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలి

- డీఈవో రవీందర్

జడ్చర్లటౌన్, జనవరి 4 : ఉపాధ్యాయులంతా టీఎల్ఎంను వినియోగిస్తూ విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రవీందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బాలికల జెడ్పీ హైస్కూల్‌లో గురువారం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో స్కూల్‌కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో రవీందర్ హాజరై ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ గురించి సోపానాల వారీగా టీఎల్ఎంను వినియోగించి బోధనలు అందించాలన్నారు. తరగతి గదుల్లో విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడూ పరిశీలిస్తూ వాటికి అనుగుణంగా విద్యాబోధనలు చేయాలన్నారు. అనంతరం పాఠశాలలో పదోతరగతి విద్యార్థినులతో సబ్జెక్టుల వారీగా సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులంతా శ్రద్ధగా చదివి పదోపరీక్ష ఫలితాల్లో జీపీఏ10 తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి జగదీశ్, సీపీడీ మురళిధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, అనంతప్ప, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట, జనవరి 4 : పోలీస్ భరోసా సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ ఆండ్ చిల్డ్రన్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న 4 పోస్టులను(మహిళలకు మాత్రమే) కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థులచే దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ గురువారం ప్రకటనలో తెలిపారు. కౌన్సెలర్ కమ్ సెంటర్ కో ఆర్డినేటర్(1) పోస్టుకు ఎంఏ, ఎమ్మెస్సీ, సైకాలజీ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ పూర్తయి ఉండి 25 నుంచి 45 ఏండ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. లీగల్ సపోర్ట్ పోస్టులకు(2) ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేసి 25 నుంచి 40 ఏండ్లలోపు ఉండాలని, సపోర్ట్ పర్సన్ పోస్టులకు(2) 25 నుంచి 35 ఏండ్లలోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12వ తేదీలోపు ఎస్పీ కార్యాలయంలోని డీపీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8712670380 నెంబరును సంప్రదించాలని సూచించారు.

పింఛన్లు అందక ఇక్కట్లు

ధన్వాడ, జనవరి 4 : ధన్వాడ మండల కేంద్రంలో పోస్టల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వారం రోజులుగా పోస్టాఫీసుకు మండలంలోని కంసాన్‌పల్లి, ధన్వాడ నుంచి పింఛన్‌దారులు తిరుగుతున్నా పింఛన్లు పంపిణీ చేయడంలేదాని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న పోస్టుమాస్టారు ఐదు, ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసి పింఛన్లను పంపిణీ చేసేవారని ప్రస్తుతం ఒక్క కౌంటర్ ద్వారా పింఛన్ ఇస్తుండడంతో నిత్యం పింఛన్ కోసం పడిగాపులు కావల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. ఈ విషయమై పోస్టుమాస్టారును వివరణ కోరగా మీషన్లు మోరయిస్తుడంతో ఒక్క కౌంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం, సన్మానం

మూసాపేట, జనవరి 4 : జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన మండలంలోని నిజాలపూర్‌కు చెందిన విద్యార్థిని గురువారం ఘనంగా సన్మానించారు. ఢిల్లీలో నిర్వహించే క్రీడల్లో పాల్గొనేందుకు, ఈ సందర్భంగా ఆ పాఠశాల పూర్వవిద్యార్థులు రూ.18,500లు ఆర్థిక సాయం అందజేశారు. నిజాలాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.భవాని ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో రాష్ట్రస్థాయి మొదటి బహుమతి సాధించినట్లు సర్పంచ్ గడ్డమీది సత్యమ్మ తెలిపారు. అదే పాఠశాలకు చెందిన మరో ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎన్‌సీఎస్‌సీ పోటీల్లో 10వ తరగతి శిరీష, 9వ తరగతి శిరీష, ఎం.ఇందు పాల్గొనడంతో వారికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున అందజేశారు. సర్పంచ్ సత్యమ్మతోపాటు భీమయ్య, కృష్ణయ్య, గ్రామపెద్దలు విద్యార్థిని సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

సమ్మె వాయిదా

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 4 : శుక్రవారం నుంచి తలపెట్టిన ఆర్టీసీ అద్దెబస్సుల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆర్టీసీ హైర్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నర్సింహులు, జిల్లా జాయింట్ సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, సభ్యులు ఖాజా అజీమోద్దీన్, రషీద్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌తో అద్దె బస్సుల ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం జరిగిందన్నారు. అద్దె బస్సుల ఓనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకవెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అంతకుముందు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యలను విన్నవించగా, ఆయన కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఎక్వాయపల్లిలో క్షుద్రపూజలు

బాలానగర్, జనవరి 4 : మండలంలోని చెన్నంగులగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఎక్వాయపల్లిలో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఓ ఇంట్లో క్షుద్రపూజలు చేస్తున్న విషయాన్ని గ్రామస్తులు గమనించారు. దీంతో అక్కడకు చేరుకుని ఐదుగురిని పట్టుకోబోగా ఒకరు తప్పించుకున్నారు. నలుగురిని పోలీసులకు అప్పగించారు. క్షుద్రపూజలు చేయడానికి ఎక్కడ నుంచి వచ్చారు ? ఎందుకోసం చేస్తున్నారని? వారిని గ్రామస్తులు ప్రశ్నించగా.. తాము హైదరాబాద్, నారాయణ్‌కేడ్ ప్రాంతాలకు చెందిన పెద్ద నర్సింహ, చిన్న నర్సింహ, దహుద్, కరీంమెల్లా అని చెప్పారు. క్షుద్ర పూజలు చేసి బంగారం తవ్వి తీయడానికి వచ్చినట్లు తెలిపారు. ఈ సంఘటనలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ఆల సోదరుడు శశివర్ధన్‌రెడ్డి మృతి

సోదరుని పాడెమోస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

భూత్పూర్, జనవరి 4: మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి(60) బుధవారం అర్ధరాత్రి అన్నాసాగర్‌లో సొంతింటిలో గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం విషయం తెలిసిన వెంటనే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇంటికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో వచ్చారు. అనంతరం పార్లమెంట్ సభ